సుప్రీం వ్యాఖ్యలు బాబుకు చెంపపెట్టు

- ప్రజల దృష్టి మరల్చేందుకే తిరుపతి లడ్డూ వివాదం
- ఎన్నికల హామీల అమలులో పూర్తిగా వైఫల్యం
- మాజీ ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే గంగుల ప్రభాకర్‌రెడ్డి, బిజేంద్రనాథ్‌రెడ్డి
- శిరివెళ్లలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు పరామర్శ


కార్యకర్తను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే బిజేంద్రనాథ్‌రెడ్డి

శిరివెళ్ల: తిరుపతి లడ్డూ వివాదంపై దేశ సర్వోన్నత న్యాయస్థానం చేసిన వాఖ్యలు సీఎం చంద్రబాబునాయుడుకి చెంపపెట్టని మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రానాథ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రం శిరివెళ్లలో ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు గౌండా ఇబ్రహీం, దొర్నిపాటి రఫీ, పసుల ప్రభాకర్, ఉల్లి సుబ్బరాయుడును వారు పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ వంద రోజుల పాలన అట్టర్ ఫ్లాప్ కావడంతో బాబు డొంక తిరుగు మాటలకు దిగారన్నారు. విజయవాడ వరదలను పసిగట్టడంలో, సూపర్ సిక్స్ హామీలు అమలు చేయడంలో బాబు విఫలమయ్యారన్నారు. వాటి నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు తిరుపతి లడ్డూ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చారన్నారు. కల్తీ జరగలేదని నివేదికలు చెబుతున్నా బాబు తన స్వార్థ రాజకీయ ప్రయోజనాలు కోసం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని దెబ్బతిసేందుకు కుట్ర పన్నారన్నారు. విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు చేసిన వ్యాఖ్యలతో బాబు తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ పదవిలో ఉన్న వ్యక్తి ఏ ఆధారాలు లేకుండా, విచారణ చేయకుండా లడ్డూ లో కల్తీ జరిగిందని ఎలా చెబుతారని ప్రశ్నించారు. ఈ విషయంలో వాస్తవాలు తేలాలంటే సీబీఐతో విచారణ చేయాలన్నారు.

టీడీపీ దౌర్జన్యాలు అధికమయ్యాయి

ఆళ్లగడ్డలో టీడీపీ నాయకుల అక్రమాలు, దౌర్జన్యాలు అధికమయ్యాయయని మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రానాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. తాజాగా పేదల పక్కా గృహాల కోసం మార్కెట్ యార్డులో నిల్వ ఉంచిన 500 టన్నుల ఇసుకను సైతం ట్రాక్టర్లలో తరలించారన్నారు. ఈ విషయం పోలీస్‌స్టేషన్ దాకా చేరిందన్నారు. ఉచిత ఇసుక విధానం ఫెయిలైందని, నియోజకవర్గంలో ఇసుక దొరకక ఇళ్ల నిర్మాణాలు ఆగిపోయాయన్నారు. గ్రామాల్లో భవన కార్మికులు పనులు దొరకక ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైఎస్ చైర్మన్ దిల్షాద్‌బేగం, ఎంపీపీ నాయక్ వసీం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బి.అబ్దుల్ సలాం, సర్పంచు సాలమ్మ, ఉప సర్పంచు ఇంతియాజ్, దేవస్థానం మాజీ చైర్మన్ తిమ్మరాయుడు, కాపు సంఘం నాయకుడు ముడిమాల నాగరాజు, కామినేనిపల్లె, వీరారెడ్డిపల్లె సర్పంచులు మేర్వ చిన్న నరసింహ్మారెడ్డి, మందాల శివారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై దాడులు


రికార్డులను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

నంద్యాల(అర్బన్): పట్టణంలోని ఎరువుల దుకాణాలపై వ్యవసాయాధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. నంద్యాల, డోన్ ఏడీఏలు రాజశేఖర్, అశోక్ వర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని దుర్గా భవానీ ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాన్ని తనిఖీ చేశారు. రూ.4.90 లక్షలు విలువ చేసే 78 కేజీల ఎరువులకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడంతో వాటి అమ్మకాలను నిలుపుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ హోల్‌సేల్, రిటైల్ ఎరువుల దుకాణాల యజమానులు ఎరువుల కొరత సృష్టించకూడదన్నారు. స్టాక్‌ను సక్రమంగా సరఫరా చేయాలన్నారు. రిజిస్టార్, గ్రౌండ్ బ్యాలెన్స్ సమానంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు ఎరువులను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. దుకాణాల్లో ఎరువులు, పురుగు మందులు కొన్న ప్రతి రైతుకు బిల్లు ఇవ్వాలన్నారు. తనిఖీల్లో వ్యవసాయాధికారి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న ఉరుసు


ప్రత్యేక అలంకారంలో సయ్యద్‌షా జమాలుద్దీన్ బాద్‌షా దర్గా

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని మెయిన్ బజార్‌లో వెలసిన హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా జమాలుద్దీన్ బాద్‌షా చిష్తివుల్ ఖాద్రి మదని దర్గా, గాంధీచౌక్‌లోని హజరత్ సయ్యద్ గులాబ్‌ షా వలి రిఫాయి అహమ్మది రహంతుల్లా అలై ఉరుసు సోమవారం జరిగింది. ఈ వేడుకల సందర్భంగా భక్తులు ఆయా దర్గాలను దర్శించుకుని ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. గాంధీచౌక్‌లోకి గులాబ్‌షా దర్గాలో రాత్రి స్వామికి గంధం సమర్పించారు.

పోషకాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యం


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ

దొర్నిపాడు: తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాలు ముగింపు సందర్భంగా సోమవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రం-3లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పోషక విలువలు కల్గిన ఆహారం తీసుకోవాలన్నారు. దీనివల్ల రక్తహీనతను నివారించ వచ్చన్నారు. అలాగే పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల బిడ్డ ఆరోగ్యంగా జన్మిస్తారన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణుల రిజిస్ట్రేషన్ చేయించారు. అంగన్‌వాడీ కార్యకర్త వెంకట సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి దేవీశరన్నవరాత్రులు


ఉత్సవాల ఆహ్వాన పత్రిక విడుదల చేస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో మత్యకన్యకా పరమేశ్వరి దేవి శరన్న వరాత్రోత్సవాలు ఈనెల 3వ తేది నుంచి ప్రారంభం కానున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ముడియం నరసింహారావు శ్రేష్టి తెలిపారు. సోమవారం ఆ సంఘం సభ్యులు ఉత్సవాల ఆహ్వాన పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదిరోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అమ్మవారిని రోజుకోరూపంలో అలంకరించి పూజలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు రామకృష్ణ, ఎం.సురేష్‌బాబు, కార్యదర్శి గోపాలకృష్ణ, ఉప కార్యదర్శి వెంకట రమేష్, కోశాధికారి మధవ నరసింహయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు

ఉయ్యాలవాడ : ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని తహసీల్దార్ శ్రీనివాసులు అధికారులను హెచ్చరించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని హరివరం గ్రామానికి చెందిన రైతు కొప్పెర ఓబులేస్ హాజరై చలానా చెల్లించినా సర్వేయర్ పొలం కొలతలు వేయడలేదని ఫిర్యాదు చేశారు. దీనిపై తహసీల్దార్ స్పందించి మాట్లాడారు.

దసరా మహోత్సవాలకు ప్రముఖులకు ఆహ్వానం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఈ నెల 3 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న దసరా మహోత్సవాలకు ప్రముఖులకు దేవస్థాన అధికారులు ఆహ్వాన పత్రికలు అందించారు. సోమవారం అమరావతిలోని దేవదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డికి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, శ్రీశైల దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు ఆహ్వాన పత్రికలను అందజేసి ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు. అలాగే పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీ.జీ.భరత్‌ను పర్యవేక్షకులు ఉమేష్ కలిసి ఆహ్వానించారు. మైనార్టీ, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, కర్నూలు జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జి జస్టిస్ కపర్ది, నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా తదితర ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు, లడ్డూ ప్రసాదాలను అందజేసి ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

పెన్షనర్లకు ఐఆర్ ప్రకటించకపోతే ఉద్యమిస్తాం


నిరసన తెలుపుతున్న పెన్షనర్ల సంఘం నాయకులు

నంద్యాల(అర్బన్): ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు మంచి పీఆర్‌సీ ఇస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం నాలుగు మాసాలు అవుతున్నా ఇంత వరకు ఎలాంటి ప్రకటన చేయలేదని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం మాజీ ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు అన్నారు. ఈ అంశంపై సోమవారం పెన్షనర్ల సంఘం కార్యాలయం ఎదుట పెన్షనర్లు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగ సంఘాల నాయకులను చర్చలకు ఆహ్వానించలేదన్నారు. వేతన సవరణలో చట్ట విరుద్ధంగా తగ్గించిన పెన్షనర్ల అడిషనల్ క్వాంటమ్‌ను వెంటనే పునరుద్ధరించాలన్నారు. 12వ పీఆర్‌సీ, ఐఆర్‌ను తక్షణమే ప్రకటించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రామసుబ్బయ్య, నారాయణ, సుంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించాలి


ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ రాజకుమారికి అందజేసి మాట్లాడారు. జిల్లాలో నందికొట్కూరు, ఆళ్లగడ్డ, బనగానపల్లె, ఆత్మకూరు, పాణ్యం నియోజకవర్గాల్లో సుమారు 20వేల హెక్టార్లలో మొక్కజొన్న పంటను రైతులు పండించారన్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో అధిక వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. వారికి ఎకరాకు రూ.40వేలు పరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న, ఏఐటీయూసీ కార్యదర్శి బాలకృష్ణ, గోస్పాడు మండల కార్యదర్శి హరినాథ్, జిలానీ, బాషా, నరసంహులు, సంజీవులు, పాములేటి, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు రూ.26వేలు వేతనమివ్వాలి


ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): వివిధ ప్రభుత్వ శాఖల్లో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, టైం స్కేల్ ప్రకారం పని చేసే కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఆ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం నూనెపల్లె ఓవర్ బ్రిడ్జి నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కేఎండీ గౌస్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఏసురత్నం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులను తొలగిస్తుందన్నారు. ఇలా చేయడం మంచిది కాదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను సర్కారు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్‌మెంట్ వయస్సు 62 సంవత్సరాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించి, ఆరోగ్య బీమా వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని కోరారు కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకుడు భాస్కరాచారి, సీఐటీయూ కార్యదర్శి బాలవెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పాలకులు పట్టించుకోకపోవడంతో...


అప్పనపల్లె వద్ద 19వ బ్లాక్ మైనర్ కాల్వ గండిని జేసీబీ సాయంతో పూడ్చుతున్న దృశ్యం

- రైతులే సొంతంగా సాగునీటి కాలువ గండ్లు పూడ్చివేత


నీరు సులువుగా పారేందుకు కాల్వలో పూడిక తొలగించిన దృశ్యం

రుద్రవరం: మండల పరిధిలోని అప్పనపల్లె వద్ద 19వ బ్లాక్ మైనర్ కాల్వకు గండి పడి 60 రోజులు దాటింది. దానిని పూడ్చి రైతులకు సాగు నీరు అందించాల్సిన టీజీపీ అధికారులు, కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. దీంతో రైతులే ఆ పనులు చేపట్టారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో కురిసిన వర్షాలకు కాల్వ పరిధిలోని 6 వందల ఎకరాల ఆయకట్టు పొలాల్లో రైతులు మొక్కజొన్న, మినుము, వరి, వేరుశనగ వంటి పంటలు సాగు చేశారు. తర్వాత వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో చుట్టు పక్కల బోరు మోటార్ల ద్వారా పంటలను త డుపుకున్నారు. ఆగస్టు 1న తెలుగుగంగ ప్రధాన, ఉప ప్రధాన కాల్వల నుంచి సాగు నీరు రావడంతో రైతులు సంతోషించారు. అయితే, ఈ సంతోషం గంటల్లోనే రైతుల ముఖాల్లో నుంచి మాయమైంది. ఎందుకంటే మైనర్ కాల్వకు గండి పడటంతో నీరంతా దిగువకు వెళ్లకుండా మధ్యలోనే వృథా అయింది. ఈ విషయాన్ని రైతులు తెలుగుగంగ అధికారుల దృష్టికి తీసుకెళ్లితే మట్టి సంచులు అడ్డుగా వేశారు. కొద్దిసేపటికే ఆ సంచులు నీటిలో కొట్టుకోపోయాయి. తర్వాత అధికారులు పట్టించుకోకపోవడంతో కొండమాయపల్లె, వెలగలపల్లె గ్రామాల రైతులు ముందుకు వచ్చారు. ఆ గ్రామాల నిధి నుంచి రూ.లక్ష తీసుకొని గండి పూడ్చి వేత, మైనర్ కాల్వలో పూడిక తీత పనులు చేపట్టారు. జేసీబీ, ఎక్స్‌కవేటర్, 7 ట్రాక్టర్లతో పనులు చేపట్టారు. అధికారులు, పాలకులు స్పందించకపోవడంతో పంటలను కాపాడుకునేందుకు తామే గండి పూడ్చివేతతో పాటు కాల్వలో పూడిక తీత పనులు చేపట్టినట్లు రైతులు వెంకట్రామిరెడ్డి, బాషు తెలిపారు.

పకడ్బందీగా పింఛన్ల పంపిణీ

- ఉదయం నుంచి ప్రక్రియను ప్రారంభించాలి
- అధికారులకు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశం


మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(న్యూటౌన్): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ప్రక్రియను పకడ్బందీ చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటీనరీ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పెన్షన్ల పంపిణీ, ఉపాధ్యాయ అర్హత పరీక్ష, స్వర్ణాంధ్ర -2047, ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 2.18 లక్షల మంది పెన్షన్‌దారులున్నారన్నారు. వీరందరికీ మంగళవారం ఉదయం నుంచే పింఛన్ సొమ్ము అందించాలన్నారు. తొలి రోజు నగదు బట్వాడా, పంపిణీ విషయంలో అత్యంత జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ఎలాంటి నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శించకూడదన్నారు.

3 నుంచి టెట్

ఈనెల 3 నుంచి 21 వరకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) జరగనున్న నేపథ్యంలో అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 8,800 మంది టెట్‌కు హాజరవుతున్నారన్నారు. ఆర్జీఎం, శాంతిరాం, ఎస్‌వీఆర్ కాలేజీల్లో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఆయా కేంద్రాల్లో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించాలన్నారు. అలాగే స్వర్ణాంధ్ర - 2047 ప్రణాళిక రూపకల్పనకు క్యూఆర్ కోడ్‌స్కాన్ ద్వారా ప్రజల అభిప్రాయాల సేకరణ చేపట్టాలన్నారు. దీనిపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. జిల్లాను చెత్త రహిత జిల్లాగా మార్చేందుకు పంచాయతీ, మున్సిపల్ అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. తాను పర్యటించే ప్రదేశాల్లో రోడ్లకు ఇరువైపులా చెత్త కనపడరాదన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ఫొటోలకే పరిమితం కాకూడదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఓటర్ల జాబితా సవరణను వెంటనే పూర్తి చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ మాట్లాడుతూ జిల్లాలో 29 వేల ఎకరాలకు సంబంధించి ఫ్రీ హోల్డ్ భూముల పరిశీలన ప్రారంభించామని, ఎక్కడైతే రిజిస్ట్రేషన్ జరిగిందో సంబంధిత భూములను రీ వెరీఫై చేసి సంబంధిత నివేదికలను సమర్పించాలన్నారు. భూములకు సంబంధించిన ప్రతి లావాదేవీలు క్లియర్‌గా ఉండాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ పద్మజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు పాల్గొన్నారు.

క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు జ్ఞాపికలు

నంద్యాల(అర్బన్): స్వర్ణాంధ్ర - 2047 విజన్ డాక్యుమెంట్‌పై పాఠశాల విద్యార్థుల ఉపన్యాస భావాలు అందరికీ స్ఫూర్తిదాయకం కావాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటనరీ హాలులో స్వర్ణాంధ్ర -2047 క్విజ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కలెక్టర్, జేసీలు జ్ఞాపికలు అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వర్ణాంధ్ర-2047 దార్శనిక పత్ర రూపకల్పనపై పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన పాఠశాల విద్యార్థులకు ప్రశంసా పత్రాలతో పాటు జ్ఞాపికలు అందజేశారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నంద్యాల(న్యూటౌన్): ఆటో కార్మికుల సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐటీయూసీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు భూమిని శ్రీనివాసులు, శీను అన్నారు. సోమవారం పట్టణంలోని చైతన్య స్కూల్ వద్ద పాఠశాల ఆర్ఐ చౌదరి, ప్రిన్సిపాల్ రఘురామిరెడ్డి, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్ ఆటోయూనియన్ జెండాను ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమన్న మాట్లాడుతూ ఆటోల్లో పిల్లలను అధికంగా ఎక్కించు కోకూడదన్నారు.

కార్యక్రమంలో ఆటో కార్మికులు సిద్దిక్, ఆంజనేయులు, ఈశ్వరయ్య, సలార్, రఫీ, బండి శీను, చౌదరి, బాలవెంకటేశ్వర్లు, దానం, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎంకు ఘన సన్మానం

రుద్రవరం: బదిలీపై కర్నూలుకు వెళ్తున్న రుద్రవరం వెలుగు ఏపీఎం కల్పలతను మండల గ్రామైక్య సంఘం సభ్యులు, వీఓలు సోమవారం స్థానిక కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. సీసీ దేవానంద్‌ను కూడాను సత్కరించారు. వీఓఏ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నరసింహులు మాట్లాడుతూ ఏపీఎం కల్పలత మహిళల అభివృద్ధికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో రుద్రమదేవి మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవి, కార్యదర్శి లలిత, కమ్యూనిటీ కో ఆర్డినేటర్ రాధారాణి, వీఓఏ యూనియన్ నాయకులు గురుస్వామి, మరియమ్మ, తదితరులు ఉన్నారు.

స్పోర్ట్స్

హాకీ రాష్ట్ర అధ్యక్షుడిగా చాణిక్యరాజు


చాణిక్యరాజును అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ఏపీ హాకీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా నంద్యాలకు చెందిన చాణిక్యరాజు ఎన్నికైనట్లు ఎస్పీజీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జీవలత, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్ తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎస్పీజీ హైస్కూల్‌లో అభినందన సభ ఏర్పాటు చేశారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన చాణిక్యరాజు మాట్లాడుతూ హాకీ ఆంధ్రప్రదేశ్ సర్వసభ్య సమావేశం గుంటూరులో సెప్టెంబర్ 29వ తేదీన జరిగిందన్నారు. సమావేశంలో తనను ఎన్నుకున్నట్లు తెలిపారు. నంద్యాల ఎస్పీజీ పాఠశాలలో చదివిన చాణిక్యరాజు హాకీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాష్ట్రానికి ఎన్నిక కావడం అభినందనీయమన్నారు.

బాలబాలికల తైక్వాండో ఎంపిక పోటీలు ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 68వ జిల్లా స్థాయి అండర్-14, 17 బాల బాలికల తైక్వాండో ఎంపిక పోటీలు సోమవారం నిర్వహించారు. పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఈ పోటీలను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ బాధ్యులు రవికృష్ణ, తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చంద్రమౌళి, స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ శివకుమార్ ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో విద్యార్థినీ విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు . క్రీడల్లో రాణించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకొని రావాలన్నారు. తైక్వాండో ఆత్మరక్షణగా తోడ్పడుతుందన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు తిరుపతి జిల్లాలోని శ్రీనివాసన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.అనంతరం జాతీయ స్థాయిలో రాణించిన ఆకుల సమీరాను అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ అసోసియేషన్ కార్యదర్శి రవికుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు విశ్వనాథ్, శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు, విజయలక్ష్మి, సంజీవగౌడ్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన చాగలమర్రి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి పండును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చాగలమర్రి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి పి.పండు జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.కోటయ్య, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు. సెప్టెంబర్ 20, 21వ తేదీల్లో వైఎస్సార్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చడంతో తమ విద్యార్థి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు వారు తెలిపారు. ఈనెల 8వ తేది నుంచి హైదరాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు. అభినందన సభలో పీడీ దాదా పీర్, పీఈటీ భారతి, ఉపాధ్యాయులు ఐడీకే శాస్త్రి, మహబూబ్‌బాషా, రవీంద్రారెడ్డి, శివశంకర్, నారాయణమూర్తి, మైకెల్ విజయరాజు, షఫీరూన్, మధురిమ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించాలి

దొర్నిపాడు: ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని తహసీల్దార్ సుభద్ర అన్నారు. సోమవారం ఆమె ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. కార్యాలయానికి వచ్చే ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించి పరిష్కరించాలన్నారు. అలాగే మ్యూటేషన్, కుల, ఆదాయ ధ్రువపత్రాలు పెండింగ్ లేకుండా వెంటనే ఇవ్వాలని వీఆర్‌ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో డీటీ మాధవ్, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ రామచంద్రయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభాకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీలు

ఉయ్యాలవాడ : మండలంలోని పలువురు పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారు. ఆర్.జంబులదిన్నె కార్యదర్శి విజయదీప్తి, తుడుమలదిన్నె కార్యదర్శి సతీష్‌కుమార్, ఇంజేడు కార్యదర్శి రవిప్రకాష్‌రెడ్డి మండలంలోని సుద్దమల్ల, కాకరవాడ, సర్వాయిపల్లె గ్రామ పంచాయతీలకు బదిలీ అయ్యారు.

అలాగే దొర్నిపాడు మండలం నుంచి కార్యదర్శులు బందెల మాలత, వెంకటేశ్వర్లు, చిన్నహుసేని మండలంలోని ఇంజేడు, తుడుమలదిన్నె, పుచ్చకాయలపల్లె గ్రామ పంచాయతీలకు వచ్చారు.